

విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ప్రోత్సాహం

8లో

విద్యార్థులకు ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

విశాఖ: దసరా సంబరాల్లో భాగంగా శిల్పారామంలో ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది.



ఘనంగా తిరువీధి

సింహాచలం: సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు తిరువీధి నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ రేపు

- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై ఈనెల 7న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ విద్యాశాఖలో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు, నాన్ టీచింగ్ ఉద్యోగుల పెండింగ్ సర్వీసు సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగం ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణ వేగవంతం

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి 516ఈ నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూ సేకరణ, అటవీశాఖ అనుమతులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం నుంచి కొయ్యూరు, కొయ్యూరు నుంచి పాడేరు, అరకులోయ సెక్షన్ల మధ్య చేపట్టిన జాతీయ రహదారి పనులపై సమీక్షించారు. ఎనిమిది ప్రాంతాల్లో సుమారు 6.30 కిలోమీటర్ల రహదారి అటవీ ప్రాంతం మీదుగా వెళ్తున్నందున 18.22 హెక్టార్ల భూమి అవసరమని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు వెంటనే ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం, చింతూరు,చింతపల్లి డీఎఫ్‌వోలను ఆదేశించారు. భూముల సర్వే పూర్తిచేసి నష్ట పరిహారం కూడా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మూడు డివిజన్ల సబ్‌కలెక్టర్లకు సూచించారు. జేసీ అభిషేక్‌గౌడ్,సబ్‌కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ, చింతూరుపీవో అపూర్వభరత్, డీఆర్వో పద్మావతి, హైవే అధికారులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భారీస్థాయిలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడంతో ఏవోబీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటన నుంచి తప్పించుకున్న మావోయిస్టులు సరిహద్దు ప్రాంతానికి వచ్చి తలదాచుకునే అవకాశం ఉన్నందున ఆంధ్రా–ఒడిశా పోలీసు బలగాలు అప్రతమత్తమయ్యాయి. అణువణువు జల్లెడ పట్టడంతో గిరిజన గ్రామాలు భయం గుప్పెట్లో ఉన్నాయి.



ఏవోబీలో టెన్షన్

- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త వాతావరణం
- అప్రమత్తమైన పోలీసులు
- చుట్టుముట్టిన బలగాలు
- అణువణువు ముమ్మర గాలింపు

సాక్షి, పాడేరు: ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పుల నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నారాయణపూర్–దంతేవాడ జిల్లాల సరిహద్దులోని దక్షిణ అబుజ్‌మడ్ ప్రాంతం నేడూరు–తులతులి అడవుల్లో శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర పోలీసు బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. రాత్రి వరకు జరిగిన ఈ భీకర పోరులో భారీ సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మావోయిస్టు పార్టీ కీలక నేతలతో పాటు ఆంధ్రా, ఒడిశాకు చెందిన మావోయిస్టు సభ్యులు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్‌కౌంటర్ సమాచారం తెలుసుకున్న పోలీసు బలగాలు వెంటనే ఏవోబీలో మోహరించాయి. ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టులు ఆంధ్ర ఒడిశా సరిహద్దు కటాఫ్ సేఫ్ జోన్‌లోకి వచ్చి తలదాచుకునే అవకాశాలు ఉన్నందున కూంబింగ్ ముమ్మరం చేశాయి. అణువణువు జల్లెడ పడుతున్నాయి.

వరుస ఎన్‌కౌంటర్లతో తీవ్ర నష్టం

దండకారణ్యంలో వరుస ఎన్‌కౌంటర్లు నక్సల్బరీ ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకప్పుడు మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్ అడవులు సురక్షిత ప్రాంతం. ఇప్పుడు ఆ ప్రాంతంలో కూడా పోలీసులు పట్టు సాధించారు. అందువల్లనే భారీ సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. తాజా ఘటనతో వారి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

- ఈ రెండేళ్లలో ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాలతో పాటు అబుజ్‌మడ్ దండకారణ్యంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌటర్లలో సుమారు 180 మంది వరకు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు.

మరో రామ్‌గుడ..

ఆంధ్రా సరిహద్దు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా బడిమెల బ్యాక్ వాటర్ ప్రాంతం రామ్‌గుడలో 2016లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 32 మంది మావోయిస్టులు హతమయ్యారు. మావోయిస్టుల శిబిరంపై పోలీసులు కాల్పులు జరపడం అప్పటిలో సంచలనమైంది. అప్పటి నుంచి మావోయిస్టు పార్టీ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటోంది. సురక్షిత ప్రాంతంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ అడవులకు మకాం మార్చినా వారికి అక్కడ కూడా ఎదురు దెబ్బలు తప్పలేదు.

- దండకారణ్యంలో ఎప్పటికప్పుడు ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. అయితే రామ్‌గుడ తరువాత అదే తరహాలో ఎనిమిదేళ్ల తరువాత ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పుడు జరిగిన ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బగానే చెప్పవచ్చు. ఈ ఘటనను మరో రామ్‌గుడగా పోలీసు బలగాలు చెబుతున్నాయి.
- దండకారణ్యంలో మావోయిస్టు కార్యకలపాల నిరోధమే లక్ష్యంగా కేంద్ర పోలీసు బలగాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఏవోబీలో మావోయిస్టుల సంచారం తగ్గినప్పటికీ సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ఈ ప్రాంతంపై పోలీసు బలగాలు ప్రత్యేక దృష్టి సారించడంతోఎదురు కాల్పుల ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

గిరి యువత శాంతి ర్యాలీ



మంగంపాడులో శాంతి ర్యాలీ చేస్తున్న గిరిజన యువత

మోతుగూడెం: బొడ్డగండి పంచాయతీ డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగంపాడు వారపు సంతలో శనివారం మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 20 వరకు నిర్వహించే మాసోత్సవాలను వ్యతిరేకిస్తూ ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం యువకులు శాంతి ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

అగ్ర నేతలే లక్ష్యం..



ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సరిహద్దులో మోహరించిన పోలీసు బలగాలు

సీలేరు: మావోయిస్టులు ఉనికి కోల్పోతున్న తరుణంలో పూర్తి అణచివేతే లక్ష్యంగా ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలు వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయి. రామ్‌గుడ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత ఆర్‌కే కుమారుడు మున్నా చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయాడు. అప్పటినుంచి మావోయిస్టు ఉద్యమంలో చేరికలు తగ్గాయి. ఇదే తరుణంలో ప్రభుత్వాలు కూడా అభివృద్ధి, సంక్షేమాన్ని మారుమూల గ్రామాల గిరిజనులకు చేరువ చేశాయి. దీంతో గిరిజనుల్లో కూడా మార్పు వచ్చింది. పాడేరు జిల్లా కేంద్రంగా కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం కూడా మావో యిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపింది. వారికి గ్రామాల్లో సహకారం అందించే మిలీషియా సభ్యులు లొంగిపోవడంతో మరింత పట్టు కోల్పోయింది. దీంతో పోలీసులు స్పీడ్ పెంచారు. మావోయిస్టుల అగ్రనేతలే లక్ష్యంగా ముందుకు సాగుతూ పట్టు సాధిస్తున్నారు. దీనిలో భాగంగానే అబుజ్‌మడ్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో మావోయిస్టులు భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

భయం గుప్పెట్లో గ్రామాలు

ఆంధ్రా ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం చాలా రోజుల తరువాత తుపాకుల మోతతో దద్దరిల్లింది. దీంతో నిన్నటివరకు ప్రశాంతంగా ఉన్న గిరిజన గ్రామాలు భయం గుప్పెట్లో ఉన్నాయి. పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచాయి. దీంతోపాటు అనుమానిత ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేయడంతో ఎప్పుడు ఏ జరుగుందోనన్న ఆందోళన నెలకొంది.

విజన్ 2047కు సహకరించండి

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

సాక్షి,పాడేరు: జిల్లా విజన్ 2047కు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారత్ ఎలా ఉండాలి అనే అంశంపై వికసిత్ భారత్‌పై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర విజన్ 2047పై రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రుపొందిస్తున్నాయన్నారు. జిల్లాకు సంబంధించి అందరి సలహాలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. వికసిత్ భారత్ 2047 అమలు, ప్రణాళికలు, ప్రయోజనాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రక్తహీనత కేసులపై ప్రత్యేక దృష్టి: అరకు ఎంపీ తనూజరాణి

జిల్లాలో రక్తహీనత కేసులు అధికంగా ఉన్నాయని, ప్రజల ఆరోగ్యం–రక్తహీనత సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి కోరారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడారు. గిరిజనుల వైద్య ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలతో పాటు సికిల్‌సెల్ ఎనీమియా కేసులకు అవసరమైన రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయాభివృద్ధితో మేలు: అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధితోపాటు పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు, మత్స్యగుండంలో అడ్వంచర్ పార్కు అభివృద్ధి, అన్ని గ్రామాలకు తారురోడ్లు నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. గిరిజన ప్రాంత చిన్నారులకు పాత విద్యా విధానమే మంచిదని ఆయన అభిప్రాయ పడ్డారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరిషాదేవి వీడియో కాన్ఫరెన్స్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, గిరిజన యువప్రగతి, వీసీఎఫ్ టాటా సంస్థ ప్రతినిధులు డాక్టర్ సింహాచలం, డాక్టర్ కె.అప్పలరాజు, కొయ్యూరు ఎంపీపీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో సినిమా షూటింగ్ సందడి

డుడుమ జలాశయం వద్ద జగపతిబాబుతో సన్నివేశాల చిత్రీకరణ



డుడుమ జలాశయం డ్యామ్‌పై ప్రముఖ విలక్షణ నటుడు జగపతి, చిత్ర యూనిట్ సభ్యులు

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో శనివారం మాస్కిన్ ప్రాజెక్టు చిత్రీకరిస్తున్న సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ప్రముఖ సినీ డైరెక్టర్ జాగర్లమూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో అనుష్క శెట్టి ప్రధాన కథానాయికగా నటిస్తున్న సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను డుడుమ జలాశయం, జలపాతం, వ్యూ పాయింట్ ప్రాంతాల్లో చిత్రీకరించారు. ప్రముఖ నటుడు జగపతిబాబు, జాన్ విజయ్ మధ్య కూడా చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి మరో రెండు మూడు రోజుల ఈ ప్రాంతంలో షూటింగ్ జరుగుతుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఇలావుండగా జగపతిబాబు, పలువురు సినిమా నటులను చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారితో ఫొటోలు తీసుకున్నారు.

భార్యాభర్తలకు పాము కాటు

- వెంటనే ఆస్పత్రికి తరలింపు
- విషమించిన భార్య రమణమ్మ ఆరోగ్యం
- మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి
- దంపతులను విడదీసిన మృత్యువు



పాడేరు జిల్లా ఆస్పత్రిలో రమణమ్మ (మృతి చెందక ముందు) చికిత్స పొందుతున్నప్పటి చిత్రం

పెదబయలు/పాడేరు : వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లాపాపలతో సంతోషంగా జీవిస్తున్న భార్యాభర్తలను మృత్యువు పాము కాటు రూపంలో విడదీసింది. ఈ విషాదకరమైన ఘటన పెదబయలు మండలం పర్రెడ పంచాయతీ మారుమూల కుర్తాడిలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన రమేష్ (30), రమణమ్మ(25) భార్యాభర్తలు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే ఈనెల 4న ఇంట్లో పడుకున్నారు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో వారిని పాము కాటేసింది. ఉదయం 6 గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురైన వారిని కుటుంబ సభ్యులు 108 లో ముంచంగిపుట్టు సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వీరికి వైద్యం అందిస్తున్నారు. ఈ సమయంలో రమణమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించింది. వెంటనే ఆమెను అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. భర్త రమేష్ పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

స్నేహితుడిని హతమార్చిన ఇద్దరి అరెస్టు

- విజిటింగ్ కార్డు ఆధారంగా కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- ఎస్ఐ అరుణ్‌కిరణ్, సిబ్బందిని అభినందించిన సీఐ రమేష్



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రమేష్, చిత్రంలో నిందితులు

చింతపల్లి : మండలంలోని పెద్దబరడ పంచాయతీ చింతలూరు టేకు తోటలో జరిగిన హత్యకు సంబంధించి కేసులో నిందితులను ఎస్ఐ అరుణ్‌కిరణ్ అరెస్టు చేసినట్టు సీఐ రమేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. రాజమండ్రికి చెందిన దొడ్డి రాజు అర్జున్(50) అక్కడే ఉంటూ వడ్రంగి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి బానిస కావడంతో 20ఏళ్ల క్రితమే అతనిని భార్య, పిల్లలు వదిలి హైదరాబాద్ వెళ్లిపోయారు. అక్కడ వారు కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రాజమండ్రిలోనే ఉంటున్న అర్జున్ అదే ప్రాంతానికి చెందిన మరో వడ్రంగి కార్మికుడు వెంకటేష్, ఆటో డ్రైవర్ పుష్పరాజ్‌తో స్నేహం చేశాడు. వీరి ముగ్గురు తరచూ మద్యాన్ని సేవించేవారు. రాజమండ్రి ప్రాంతంలో కూలి పనులు దొరకడం లేదని వెంకటేష్ చెప్పడంతో ఆ ముగ్గురు కలిసి రాజమండ్రిలోని ఇంటీరియర్ డెకరేషన్ యజమాని లక్ష్మణరావును ఉపాధి కోసం గత నెల 26న కలిశారు. అతని నుంచి ముగ్గురు మూడు విజిటింగ్ కార్డులు తీసుకున్నారు. అనంతరం వారు గత నెల 27న అక్కడి నుంచి మండలంలోని చింతలూరు బయలుదేరారు. మార్గం మధ్యలో లోతుగెడ్డ జంక్షన్ వద్ద ముగ్గురూ పూటుగా మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. మద్యం మత్తులో పుష్పరాజ్, వెంకటేష్‌ను అర్జున్ తిట్టి అవమానపరిచాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఇద్దరు అర్జున్‌ను అక్కడి నుంచి చింతలూరు తోట వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పూటుగా మద్యం తాగించి అర్జున్ తలపై బండరాయితో మోదారు. దీంతో తీవ్రంగా గాయపడిన అర్జున్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనిని అక్కడ వదిలి వెళ్లిపోయారు. దీనిపై అప్పటిలో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని వద్ద లభించిన ఇంటీరియర్ డెకరేషన్ యజమాని లక్ష్మణరావు విజిటింగ్ కార్డు ఆధారంగా దర్యాప్తు మొదలుపెట్టారు. అతని వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అర్జున్, వెంకటేష్, పుష్పరాజ్ వచ్చిన విషయాన్ని అతను చెప్పాడు. దీని ఆధారంగా కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో వెంకటేష్, పుష్పరాజ్ డొనూరులో మద్యం సేవిస్తుండగా పట్టుకుని విచారించారు. నేరం అంగీకరించడంతో వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. మిస్టరీగా మారిన కేసును ఛేదించిన ఎస్ఐ అరుణ్‌కిరణ్, సిబ్బందిని ఆయన అభినందించారు.

క్లుప్తంగా

పాడేరు డీఎఫ్‌వోగా వెంకట సందీప్‌రెడ్డి



సాక్షి,పాడేరు: పాడేరు డివిజనల్ అటవీ శాఖాధికారిగా 2019 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన పొతంశెట్టి వెంకట సందీప్ రెడ్డిను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప డీఎఫ్‌వోగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పాడేరు వస్తున్నారు. అలాగే ఇప్పటివరకు ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేసిన వినోద్‌కుమార్‌ను ప్రభుత్వం అనంతపురం జిల్లా పుట్టపర్తి డీఎఫ్‌వోగా ఇటీవల బదిలీ చేయడంతో ఆయన శనివారం రిలీవ్ అయ్యారు.

డీఎఫ్‌వో వినోద్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న డీఎఫ్‌వో వినోద్‌కుమార్‌ను పూలమాలతో సత్కరించిన అటవీశాఖ అధికారులు

సాక్షి,పాడేరు: సుదీర్ఘకాలం పాడేరు డివిజనల్ అటవీశాఖ అధికారిగా పనిచేసి పుట్టపర్తి సోషల్ ఫారెస్ట్ అధికారిగా బదిలీపై వెళ్తున్న కె.వినోద్‌కుమార్‌కు అటవీశాఖ అధికారులు శనివారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.పాడేరు డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్‌లు రేంజ్ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదిలిస్తాం

- విశాఖ మీదుగా మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా అడ్డుకట్టకు చర్యలు
- మత్తు పదార్థాలను గుర్తించేందుకు ఎన్‌సీబీ నుంచి 5 డ్రగ్ డిటెక్షన్ కిట్లు రాక
- తాజాగా పోలీస్ శాఖలో చేరిన మరో 8 కే9 జాగిలాలు
- సింథటిక్ డ్రగ్స్‌ను గుర్తించేందుకు సిబ్బందికి ఎన్‌సీబీ అధికారులతో శిక్షణ



విశాఖ సిటీ: 'మత్తు'వదిలించడానికి విశాఖ పోలీసులు అష్టదిగ్బంధనం చేస్తున్నారు. జిల్లా మీదుగా మాదక ద్రవ్యాలు, గంజాయి రవాణా చేసే వారిపై మెరుపు దాడులకు ప్రత్యేక దళాలు సిద్ధమవుతున్నాయి. ఒకవైపు మత్తు పదార్థాలను గుర్తించే వ్యవస్థను పటిష్టం చేస్తూనే.. మరోవైపు పెడ్లర్ల ఆట కట్టించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక దృష్టి సారించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా డ్రగ్స్ రవాణాకు పూర్తిగా చెక్ పెట్టేందుకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులతో సైతం కొంత మంది నగర పోలీసులకు శిక్షణ ఇప్పించారు.

ప్రతి స్టేషన్‌కూ డ్రగ్ డిటెక్షన్ కిట్

మత్తు పదార్థాలను నిర్ధారించేందుకు జిల్లాలో ప్రస్తుతం రెండు డ్రగ్ డిటెక్షన్ కిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో డ్రగ్స్ నిర్ధారణ కొంత కష్టసాధ్యంగా మారింది. ఈ విషయాన్ని గ్రహించిన సీపీ న్యూఢిల్లీలోని ఎన్‌సీబీ అధికారులను సంప్రదించారు. నగర పోలీస్ అధికారులు, సిబ్బందికి మెళకువలతో పాటు డ్రగ్స్ గుర్తించే కిట్లను సమకూర్చాలని కోరారు. సీపీ విజ్ఞప్తి మేరకు ఎన్‌సీబీ ఐదు డ్రగ్ డిటెక్షన్ కిట్లను జిల్లాకు పంపించింది. దీంతో ఈ కిట్ల సంఖ్య ఏడుకు పెరిగింది. త్వరలోనే జిల్లాలోని 22 పోలీస్ స్టేషన్లకూ ఈ కిట్లను సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు.

కొత్తగా 8 కే9 జాగిలాలు

మత్తు పదార్థాలను గుర్తించేందుకు విశాఖ పోలీసులు రెండు కే9 డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు రైల్వేస్టేషన్, బస్టాండ్, పార్సిల్ కేంద్రాలు, ఇలా ప్రతి చోటా వీటి ద్వారానే డ్రగ్స్ గుర్తించే ప్రక్రియను చేపడుతున్నారు. కేవలం రెండు జాగిలాలు మాత్రమే అందుబాటులో ఉండడంతో ఏకకాలంలో తనిఖీలు కష్టసాధ్యంగా మారింది. విశాఖ మీదుగా విభిన్న మార్గాల్లో డ్రగ్స్ రవాణాను నియంత్రించాలంటే కే9 డాగ్ స్క్వాడ్‌లు మరిన్ని ఉండాలని సీపీ భావించారు. ఈ మేరకు సహకారం అందించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కోరారు. కలెక్టర్ వెంటనే సీఎస్సార్ నిధుల నుంచి 8 కే9 జాగిలాలను పోలీస్ శాఖకు సమకూర్చారు. ప్రస్తుతం వీటికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

సింథటిక్ డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

గంజాయి, మాదక ద్రవ్యాలతో పాటు సింథటిక్ డ్రగ్స్‌పై కూడా నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తరహా డ్రగ్స్‌ను గుర్తించడం కొంత కష్టసాధ్యం. సింథటిక్ డ్రగ్స్ పోర్టుల/ఫార్మా కంపెనీల నుంచి వచ్చే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖ జిల్లాలో తగరపువలస, అనకాపల్లి జిల్లా పరవాడ, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోర్టు లు, ఫార్మా పరిశ్రమలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ డ్రగ్స్‌ను గుర్తించే విషయంపై ఎన్‌సీబీ అధికారులు నగర పోలీసులకు ప్రత్యేక మెలకువలు నేర్పించారు.

డ్రగ్స్ రవాణాపై నిఘా పెట్టాం



రైలు, బస్సు, జల, వాయు మార్గాల ద్వారా విశాఖ నుంచి మత్తు పదార్థాల రవాణా అడ్డుకోడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఎన్‌సీబీ అధికారులతో ప్రత్యేకంగా సిబ్బందికి శిక్షణ ఇప్పించాం. కొత్తగా డ్రగ్ డిటెక్షన్ కిట్లు, కే9 డాగ్ స్క్వాడ్‌లు అందుబాటులోకి వచ్చాయి. తనిఖీలను మరింత విస్తృతం చేస్తాం. గంజాయి ఎక్కువగా ఒడిశా నుంచే వస్తోంది. రవాణాదారులు, వినియోగదారుల పైనే కాకుండా అసలు సూత్రధారులపై కూడా నిఘా పెడుతున్నాం.

–డాక్టర్ శంఖబ్రత బాగ్చి, పోలీస్ కమిషనర్

విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ప్రోత్సాహం

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పీవో, అధికారులు



హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు

అరకులోయ రూరల్: విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నతస్థాయికి చేరుకోగలరని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. స్థానిక యండపల్లివలస ఏకలవ్య పాఠశాలల్లో ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న కళలకు మరింత రాణింపు ఉంటుందన్నారు. గతంలో కంటే ఇప్పుడు ప్రతీ విద్యార్థి అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు.తెలుగు చిత్ర పరిశ్రమలో స్థానం సంపాదించే స్థాయి గిరిజన విద్యార్థుల కళా నైపుణ్యం చేరిందన్నారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను పోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రానున్న రెండేళ్లలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు. కల్చరల్ ఫెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం జాయింట్ సెక్రటరీ రమణమూర్తి, డీడీ రజిని, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య



కృష్ణకుమారి మృతదేహం



కృష్ణకుమారి (ఫైల్)

పాడేరు : భర్త వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ బంగారుమెట్ట కొత్తూరు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని వనుగుపల్లి పంచాయతీ బిరిమిశాల గ్రామానికి చెందిన బడ్నాయిని కృష్ణకుమారి, బంగారుమెట్ట కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్వల బాలేశ్వరరావు ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరైనప్పటికీ ప్రేమించుకోవడంతో వారి వివాహానికి ఇరువురు కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. 2016లో వీరి వివాహం జరిగింది. వారికి కొడుకు కూడా పుట్టాడు. మొదట్లో వారి కాపురం సజావుగానే సాగింది. అయితే 2021 నుంచి కృష్ణకుమారికి భర్త వేధింపులు మొదలయ్యాయి. గతంలో ఒకసారి ఆమెపై భౌతిక దాడికి పాల్పడడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించి భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తన భార్యను సక్రమంగా చూసుకుంటానని బాలేశ్వరరావు చెప్పడంతో కేసును వెనక్కి తీసుకున్నారు. దీంతో కొన్నాళ్లు బాగానే ఉన్నా మళ్లీ వేధింపులు మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో ఈనెల 4న రాత్రి 7గంటల సమయంలో కృష్ణకుమారి పురుగు మందు తాగింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితురాలు మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి బడ్నాయిని బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ సూర్యనారాయణ విలేకరులకు తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్ సదస్సులు

పాడేరు : ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధి జిల్లాలోని పాడేరు సబ్ డివిజన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించనున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి డాక్టర్ బి. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పాడేరు సబ్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు జరిగే ఈ సదస్సులో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను వినియోగదారులు తెలియజేయవచ్చన్నారు. అంతే కాకుండా విశాఖపట్నం సీతమ్మధారలో ఉన్న ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలను నిశితంగా పరిశీలించి పరిష్కార చర్యలు చేస్తామన్నారు. ఈ సదస్సుకు తనతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.మసిల్మని, డాక్టర్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య స్పెషల్స్

తాటిచెట్లపాలెం: పండగల వేళల రద్దీ దృష్ట్యా విజయవాడ-శ్రీకాకుళం రోడ్-విజయవాడ మధ్య ఆయా తేదీల్లో స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విజయవాడ-శ్రీకాకుళం రోడ్(07215) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,7,8 తేదీల్లో రాత్రి 8 గంటలకు విజయవాడలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 1.25 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.30 గంటలకు బయల్దేరి ఉదయం 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్-విజయవాడ(07216) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7,8,9వ తేదీల్లో ఉదయం 6.30 గంటలకు బయల్దేరి అదేరోజు ఉదయం 9.30 గంటలకు దువ్వాడకు, సాయంత్రం 4గంటలకు విజయవాడ చేరుకుంటుంది.

30 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితులతో మోతుగూడెం పోలీసులు

మోతుగూడెం: మోతుగూడెం పోలీసులు అక్రమంగా తరలిస్తున్న శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో గుడ్లగూడు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బైకులపై గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ ప్రాంతానికి తరలిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిందితుల నుంచి బైక్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

పక్కాగా ఓటరు రేషనలైజేషన్ ప్రక్రియ

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, డీఆర్వో పద్మావతి

పాడేరు : ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీల సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ అరకులోయ నియోజకవర్గంలో 97.68శాతం, పాడేరు నియోజకవర్గంలో 96.63శాతం, రంపచోడవరంలో 98.21 శాతం ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తయినట్టు చెప్పారు. రాజకీయ పార్టీల నివేదిక మేరకు డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. ఓటర్ రేషనలైజేషన్ ప్రక్రియ పక్కాగా జరుగుతోందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్ నమోదు చేసుకోవాలన్నారు. ఫారం 6-861, ఫారం 7-853, ఫారం 8-786 పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో బి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంతాల రాంబాబు, సీపీఎం నాయకుడు దాస్, కాంగ్రెస్ నేత కృష్ణారావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు గంగరాజు, టీడీపీకి చెందిన జ్యోతికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు





అరకులోయ, సంగోడి గ్రామాల్లోని ఆలయాల్లో అన్నపూర్ణేశ్వరి , పార్వతీదేవి అలంకరణలో దుర్గాదేవి



పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: దేవి శరన్నవరాత్రి పూజలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. పాడేరులోని కనకదుర్గమ్మతల్లి, రాజరాజేశ్వరిమాత, సంగోడిలోని పార్వతీదేవి విగ్రహాలను శనివారం అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. పలు వంటకాలను దేవతామూర్తులకు నైవేద్యంగా సమర్పించారు. కుంకుమార్చన పూజలు నిర్వహించారు.అలాగే అరకులోయలోని మల్లికార్జున సమేత భ్రమరాంబదేవిని అన్నపూర్ణేశ్వరికి అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. 21 రకాల వంటకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ప్రసాద వితరణ జరిగింది.

కత్తితో బెదిరించి.. రూ.2 లక్షలు దోచుకొని..

- మహిళను ఆటో నుంచి తోసేసిన సహ ప్రయాణికులు
- ఆటో డ్రైవర్‌తో కలిసి ఇద్దరు మహిళల ఆగడం

తుమ్మపాల: ఆటోలో ప్రయణిస్తున్న మహిళను మరో ఇద్దరు మహిళలు కత్తితో బెదిరించి రూ.2 లక్షలు దోచుకున్నారు. పట్టణ ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. సీలేరు ఏపీ జెన్‌కోలో ఉద్యోగం చేస్తున్న చెక్కల సుధ అనే మహిళ శుక్రవారం మధ్యాహ్నం పట్టణానికి చేరుకుని స్వస్థలం గాజువాక వెళ్లేందుకు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆటో ఎక్కింది. జలగల మదుం వద్ద ఆటోలో ఉన్న మరో ఇద్దరు మహిళలు కత్తితో ఆమెను బెదిరించి, రూ.2 లక్షల నగదును దోచుకుని ఆమెను ఆటో నుంచి బయటకు తోసేశారు.

ఆమె తన భర్తకు ఫోన్ చేసి విషయం తెలపడంతో భర్త ఘటన స్థలానికి వచ్చి స్వల్ప గాయాలతో ఉన్న ఆమెను గాజువాక తీసుకువెళ్లారు. ఈ ఘటనపై శనివారం వచ్చి ఫిర్యాదు ఇచ్చారని ఎస్సై తెలిపారు. ఆటో డ్రైవర్, ఇద్దరు మహిళలు ఒక ముఠాగా ఏర్పడి ఈ ఘటనకు పాల్పడినట్టు అనుమానిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజాధిరాజ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. నవాహ్నిక దీక్షతో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకం, అర్చనలు నిత్య హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంలో సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో వేంచేయింపు చేసి మాఢవీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. అనంతరం గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. సాయంత్రం స్వామివారికి హంస వాహనంలో తిరువీధి సేవ నిర్వహించారు. ప్రధానార్చకులు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, రాజగోపాలాచార్యులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.